

# సద్గురు సుభాషితం

దోరికే ప్రతి అవకాశాన్ని, పరిచయమయ్యే ప్రతివ్యక్తిని తన స్వలాభం కోసం, ముందుకెళ్ళడం కోసం స్వార్థంతో ఉపయోగించుకునే వ్యక్తి మాత్రమే గొప్ప గెలుపును సాధించుకోగలడన్నది నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అలా తెలివిగా ప్రయత్నించడంవల్లే ఈ రోజు బిజినెస్‌లో ముందుకు రాగలిగాను.

అప్పుడు నాకే సహాయం చేయడానికి తయారుగా లేని వాళ్ళు, ముఖం తిప్పుకున్న వాళ్ళు, ఇప్పుడు నేను ఎదిగాక నాతో బంధాలు కలుపుకోవాలని నన్ను వచ్చి కలుస్తున్నారు. నాకు వాళ్ళతో ఏ అవసరంలేదని ముఖం మీద మొత్తినట్లు చెప్పాలని మనసు తపిస్తుంది. ఈ స్వలాభాపేక్షగల స్వార్థపరులను ఏం చేయాలి?

ఎవరు స్వార్థపరులు?

చూసిన వాళ్ళందరినీ మీ అవస రానికి ఎలా వాడుకుని ఎదగాలి అని ఆలోచించిన మీరు కాదా స్వార్థపరులు? ఈ రోజు మీరు దగ్గరవడానికి ప్రయత్నిస్తున్న వాళ్ళవల్ల మీకు ఏం లాభం లేదనుకుంటే వాళ్ళను ఏమాత్రం గౌరవించని మీరు కాదా స్వార్థపరులు?

వ్యాపారంలో ఎదిగానంటున్నారు. ఆ కాలంలో మీకె దురైన వాళ్ళంతా మీకే సహాయం చేయకుండా మీ నుంచి ఏం పొందవచ్చు అని మాత్రం ప్రయత్నిస్తే ఇప్పుడు మీరె క్కడుండేవారో ఒకసారి ఆలోచించండి.

ఈ జీవితమే మీకు ఇవ్వబడ్డ ఒక వరం. మీరు కృత జ్ఞతకలవారై బతకడంలో ఉండే సుఖం, ఎదురు చూపులుండే బతుకులో ఉండవు. ఇవ్వటంలో ఉండే ఆనందం, తీసుకోవటంలో లేదు. 'ఆకలితో బాధ పడుతున్న వ్యక్తికి నీ తిండి పెట్టినంత మాత్రాన నువ్వు నీరసించిపోవు, మరింత బలం పుంజుకుంటావు' అన్న బుద్ధుడి మాట ఒకసారి పాటించి చూడండి. ఎంత బాగుంటుందో! ఈ చర్యలోని ఆనందాన్ని ఆ అనుభవం మీకిస్తుంది.

రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలమది. జర్మనీలోని ఒక చెర అది. ఇంక ఖైదీలు పట్టుబడితే పెట్టడానికి కూడా చోటులేని పరిస్థితి. ఖైదీల సంఖ్య తగ్గించాలని చెర అధికారులు అనుకున్నారు. ప్రతి ఖైదీకి ఒక అంకె ఇవ్వబడింది.

ప్రతీ రోజూ కొన్ని అంకెలు చీటీలు వేసి తీయడం, ఆ అంకె వాడిని కాల్చి చంపడం. అలా వచ్చినవాళ్ళల్లో ఒక ఖైదీకి చావడం ఇష్టంలేదు. వాడు ఏడుస్తూ ఉండటాన్ని చూసిన ఫాదరి ఒకరు అతని దగ్గరగావెళ్ళి నవ్వుతూ భుజం మీద చేయివేశారు.

"సోదరా! నీకు చావడం ఇష్టం లేదు. బతకాలని కోరుకుంటున్నావు.

బతుకు! నీ అంకెకు స్వంతదారుడిగా నేను వధ్యశిలకు పోతాను" అన్నారు. దొరికిన అవకాశాన్ని, ముందుకొచ్చిన మిత్రుణ్ణి వాడుకున్న ఆ ఖైది ఆరోజు మరణం తప్పించుకున్నాడు.

> “ఎవరు స్వార్థపరులు?
> చూసినవాళ్ళందరినీ మీ అవసరానికి ఎలా వాడుకుని ఎదగాలి అని ఆలోచించిన మీరు కాదా స్వార్థపరులు? ఈ రోజు మీకు దగ్గరవడానికి ప్రయత్నిస్తున్న వాళ్ళవల్ల మీకు ఏం లాభంలేదనుకుంటే, వాళ్ళను ఏమాత్రం గౌరవించని మీరు కాదా స్వార్థపరులు?”

యుద్ధం అయిపోయాక అందరూ వదలిపెట్టబడ్డారు. చాలా ఏళ్ళు అతడు బతికాడు. ఐతే ఎవరో వేసిన బిచ్చమే తన ప్రాణమన్న భావనతో అతడు సిగ్గుపడని రోజంటూ లేదు.

వధ్యశిలకు సంతోషంగా వెళ్ళిన ఫాదరికీ దక్కిన ఆనందం, బతికున్నా ఈ రోజుదాకా అతనికి దక్కలేదు. తన్ను మరొకరి కోసం ధార పోసిన ఫాదరి ఆయువు ప్రమాణం ప్రకారం కొద్ది రోజులే బతికారు.

కానీ అది పరిపూర్ణమైన జీవితం.

ఆయు ప్రమాణం పొడిగించుకున్న అతడి జీవితం పరిపూర్ణం కాలేదు. కనపడే ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒక ఉపయోగాన్నెదురు చూడటం సరికాదు. మనసులో ఏదో ఆశించి స్నేహం చేయడం సరికాదు. అవసరాలు లేకుంటే ఎదురు చూపులూ ఉండవు, మోసపోవటాలూ ఉండవు.మనం బురదను ఇచ్చినా పూల చెట్టు పెరుగుతోందే...దొరికిన దాన్ని వాడుకుని ఎదగటం దాన్ని చూసి నేర్చు కోవాలి. అది తప్పేంకాదు. అయితే ఆ బురదను తనకే ఉంచుకుని, సువాసనలు వెదజల్లే పువ్వులను ఇతరులకు ఇవ్వడం ఉండేదాన్ని నేర్చుకోండి.

బిచ్చగాళ్ళు రెండు రకాలు.వీధిలో బిచ్చ పాత్ర పట్టుకు తిరిగేవాడు.అధికారంలో కూర్చున్నవాడు.ఒకడు ఆకలితో బిచ్చమెత్తుతాడు. మరొకడు అధికారాన్ని చేజిక్కించుకోడానికి, రాజ్యాన్ని ఏలడానికి బిచ్చమెత్తుతాడు. డబ్బు, అధికారం ఉన్న వాళ్ళు చాలామంది భోజనం తప్ప మిగిలినవన్నీ బిచ్చమెత్తే వాళ్ళుగానే ఉన్నారు.

తెలివిగా ఉంటే మీ ఎదుగుదల కోసం ఇతరుల్ని, అవకాశాల్ని, పరిస్థితుల్ని ఆధారం చేసుకునేవారా?

ఆలోచించండి. తనకంటూ కావాలని దేని గురించి అనుకోకుండా,అవసరం అంటూ ఏ సంకెళ్ళు తగిలించుకోకుండా బతికే వాడికే ప్రేమంటే ఏంటో అర్థం అవుతుంది, ఆనందమంటే ఏంటో తెలుస్తుంది.

పంచటం అనే దాన్ని వస్తు మార్పిడి విధానం అనుకునే వాళ్ళు ఆనందానుభూతిని పొందలేరు.

**సద్గురు జగ్గీవాసుదేవ్**



## సరికొత్త ముత్యం

ప్రతి పాఠకదేవుడ్ని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాలన్న సదాశయంతో ఏర్పరచిన శీర్షిక 'సద్గురు సుభాషితం'.

ఈ శీర్షిక చదువుతూ, తమ జీవితం సార్థకమైందన్న అభిప్రాయాన్ని నేడు లక్షలాదిమంది పాఠకదేవుళ్ళు వ్యక్తం చేస్తున్నారంటే అందుకు మొదటిగా అభినందించవలసింది శ్రీమతి జె.వి. సత్యవాణి గారినే. సద్గురు జగ్గీవాసుదేవ్ గారి 'సద్గురు సుభాషితం' తమిళస్క్రిప్ట్‌ను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేరీతిలో, సరళమైన తెలుగులోకి హృద్యంగా, అర్థవంతంగా అనువదించే అసమాన, అరుదైన ప్రతిభ శ్రీమతి జె.వి.సత్యవాణి గారికే స్వంతం.